సూర్య బుధవారం 25 ఆగస్టు 2010



## జోత్యిష్యం మనిషి జీవితానికి
## దిక్సూచి వంటిది: సి.వి.బి. సుబ్రహ్మణ్యం



డా॥ పద్మజారాణి రచించిన 'నటులు, జాతక యోగాలు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ సి.వి.బి. సుబ్రహ్మణ్యం

శ్రీత్యాగరాయగానసభ(మేజర్‌న్యూస్) మానవ జీవన వికాస క్రమంలోనే జ్యోతిష్య, శాస్త్రీయ వికాసం జరిగిందని, అనేక విజ్ఞాన శాస్త్రాల సమాహారంగా జోత్యిష్యశాస్త్ర పరిణామక్రమం విస్తరించిందని సుప్రదసిద్ధ జ్యోతిష్య శాస్త్ర పండితులు డా॥ సి.వి.బి. సుబ్రహ్మణ్యం అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారంనాడు న్యూ నల్లకుంటలోని సీజన్స్ హోటల్ సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితురాలు డా॥ ఈడ్పుగంటి పద్మజరాణి రచించిన 'నటులు... జాతకయోగాలు' అనే విశ్లేషాత్మక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యుగం అనే పదం యుగ్మం అనే అర్థంతో వాడబడిందని రోజుకు పగులు-రాత్రి, నెలకు కృష్ణ, శుక్ల పక్షాలు, సంవత్సరానికి ఉత్తర, దక్షిణ అయనాలు మొదలైన జంటలుగా కినిపిస్తుందని, శరీరంలో కూడా ఈయుగ్మ ప్రాధాన్యం అధికమని, కాలానుగుణంగా పంచభూతాల గృహరాశుల ప్రభావంతో ఎన్నో అనుభవాల పర్యవసానంగా జ్యోతిష్యశాస్త్రం విస్తరించిందని ఆయన అన్నారు. అనంతరం రచయిత్రి డా॥ పద్మజారాణిని మానస సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు.

ప్రముఖ కవి రఘుశ్రీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వ ప్రాచ్యకళాశాల ప్రిన్సిపాల్ డా॥ ఎం. వాసంతి మాట్లాడుతూ మచి, చెడుల నిర్ణయానికి, మానసిక స్థితిగతులకు, గ్రహరాశుల ప్రభావం ఉన్నందున జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా జీవితాలను మంచి పథంలో నడించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. సరేందర్, జె.వి. రావు, రాజేశ్వర్‌శర్మ, ఎం. లక్ష్మయ్య, సి.బి. చారి తదితరులు పాల్గొన్నారు. వినయ్ పాండ్యం సమన్వయ కర్తగా వ్యవహరించారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
### శాస్త్రోక్తంగా గాయత్రి యజ్ఞాలు



పద్మశాలిపురంలో గాయత్రి మహా యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు, ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్, మేజర్‌న్యూస్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం రాఖీ పౌర్ణమి పర్వదిన వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పద్మశాలిపురం, మార్కండేయనగర్ కాలనీలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు శ్రీమార్కండేయస్వామి జన్మదిన వేడుకలను , గాయంత్రి యజ్ఞ కార్యక్రమాలకు శాస్త్రోక్తంగా వేధ మంత్రోత్సరణల నడుమ నిర్వహించారు. శ్రీవీరాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో గణపతి పూజ, గౌరీ పూజ, నవగ్రహ, అష్టదిక్పాలకుల పూజలను శ్రీనివాస్ పంతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన యజ్ఞోపవితధారణ అనంతరం భక్తిశ్రద్ధలతో శ్రీగాయంత్రి మహా యజ్ఞాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గద్దెక్రిష్ణ ,బస్తీ కమిటీ అధ్యక్షుడు ఏర్వసత్యనారాయణ, ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె యాదగిరితోపాటు ఏర్వ బుచ్చయ్య,కెంచెనర్సింహ,చందు, గంజి ధనంజయ,విజయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి,కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పద్మశాలిపురంలోని శ్రీశివమార్కండేయనగర్ స్వామి ఆలయంలో మార్కండేయ స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరంబస్తీ పుర వీధుల్లో ఉత్సవ మూర్తి ఊరేగింపు నిర్వహించారు. గాయత్రి యజ్ఞానాన్ని శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆ బస్తీ పెద్దలు, పద్మశాలీకుల బంధువులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య రాఖీ పండుగ



బంజారాహిల్స్, మేజర్‌న్యూస్: అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అన్ని ప్రాంతాల ప్రజలు మంగళవారం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం ఉదయం నుండే రాఖీలను తమ సోదరులకు కట్టడానికి బాలికలు, యువతులు, మహిళల హడావిడి వీధులలో కనిపించింది. సాంప్రదాయ వసాత్రలు ధరించి సంస్కృతికి, ఆత్మీయతానుబంధాలకు ప్రతీక అయిన రాఖీ పండుగను సంతోషంగా వారు జరుపుకొన్నారు. కొందరు నాలుగైదు రోజుల ముందు నుండే తమ సోదరులకు కట్టే రాఖీలను కొనుగోలు చేసి ఉంచగా, సమయం చాలని వారు మంగళవారం కూడా రాఖీలను పెద్ద ఎత్తున కొనడం కనిపించింది. ఈ సందర్భంగా రాఖీలను విక్రయించే దుకాణాలు మంగళవారం రాత్రి వరకు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

### ప్రత్యేకతను చాటిన మహిళా కార్పోరేటర్లు

కార్యకర్తలు రాఖీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా వివిధ డివిజన్ల కార్పోరేటర్లు తమ కుటుంభీకులతోపాటు అభిమానులు, మహిళా కార్యకర్తల నడుమ ఆనందంగా జరుపుకొన్నారు. మహిళా కార్పోరేటర్లు తమ సోదరులతోపాటు ప్రియతమ నాయకులకు, మంత్రులకు రాఖీలు కట్టి ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ మేరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట్, బల్కంపేట్, సనత్‌నగర్, బోరబండ, పంజగుట్ట, సోమాజిగూడ, ఖైరతాబాద్ తదితర డివిజన్ల కార్పోరేటర్లు రాఖీ పండుగను కార్యకర్తలతో కలిసి జరుపుకొన్నారు.

### ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో...

అంతేగాక పలు హిందూ ధార్మిక సంస్థలు కూడా రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, ఎబివిపి, హిందూవాహిని, భజ్‌రంగ్‌ధళ్, హనుమాన్ శక్తి జాగరణ సమితి తదితర సంస్థలు రాఖీ పండుగను పెద్ద ఎత్తున నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు ఒకరికొకరు 'నేను నీకు రక్ష... నీవు నాకు రక్ష...మనిద్దరం కలిసి ఈ దేశానికి, ధర్మానికి రక్ష' అంటూ రాఖీలు కట్టుకుని దేశభక్తిని చాటారు.

### అక్కా, తమ్ముళ్ల అనురాగానికి నిదర్శనం రక్షాబంధన్

కవాడిగూడ(మేజర్‌న్యూస్) అక్కా, తమ్ముళ్ల, అన్నా, చెల్లెల్ల అనుబంధానికి, అనురాగానికి ప్రతీకయే ఈ రక్షాబంధన్(రాఖీ పౌర్ణమి) వేడుకలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా మంగళవారం గాంధీనగర్ కార్పొరేటర్ ముఠాపద్మనరేష్ దంపతులు, కమిటీ సభ్యులు చంద్రబాబు నాయుడును స్వగృహంలో కలిసి రక్షాబంధన్‌ను కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు ప్రజల సాంప్రదాయమైన సోదరీ, సోదరుల అప్యాయతలకు అనుసందానమైన రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఎంతో పవిత్రంగా నిర్వహిస్తుంటారని అన్నారు. ఆడపడచుల సౌభాగ్యాలను చిరకాలం అండగా ఉంటూ ఆదుకుంటామన్నా ఉద్దేశ్యంతోనే వారి వారి సోదరీమణులు అన్నలకు కట్టే రాఖీలని ఆయన అన్నారు. పెద్దల సూచనల మేరకు తరతరాలుగా ప్రజలు రాఖీ పౌర్ణమి సాంప్రదాయాన్ని పాటిస్తూ ఆడపడచుల సుఖ సౌఖ్యాలకోసం సోదరులు పాటుపడతారన్న నమ్మకంతో రాఖీలు కట్టి అన్నదమ్ముల ఆశీస్సులను పొందుతారన్నారు. అందుకణుగుణంగా అన్నదమ్ములసైతం ఆడపడచుల సుఖసౌఖ్యాల కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కమిటి సభ్యులు ముఠానరేష్, పి. గోపి, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, పి. సుధాకర్, ఎం.బి. కృష్ణ, బి.రవియాదవ్, వెంకటేష్‌యాదవ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సుల్తాన్ బజార్‌లో ఘనంగా రక్షాబంధన్

కాచిగూడ(మేజర్‌న్యూస్) సోదరీ, సోదరుల ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలిచిన రాఖీ పండగను వాడవాడలలో అన్నా, చెల్లెల్లు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం గోషా మహల్ నియోజకవర్గంలోని సుల్తాన్ బజార్ డివిజన్‌లో మార్వడీ, గుజరాతీ, సిక్‌వల్, రాజ్‌పు రోహిత్ సమాజ్‌లకు చెందిన మహిళలు రాఖీ పండుగను ఘనంగా నిర్వహించి, టీడీపీ నాయ కులకు డివిజన్‌లోని సోదరులకు రక్షాబంధనం చేశారు. ప్రతి ఏటా జరిగే ఈ పండుగకు పెద్ద ఎత్తున వివిధ సమాజాలకు చెందిన మహిళలు పాల్గొని సోదర, సోదరీమణులు ఈ పండుగను జరుపుతారు. ఈ పండుగను పురస్కరించుకొని గోషామహల్ టీడీపీ నాయకులు ఎం. ఆనం ద్‌కుమార్‌గౌడ్‌కు మార్వాడి మహిళలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చెల్లెల్లకు అన్ని విదాల ఆదుకుంటూ రక్షగా ఉండేవాడే అన్నా అని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో మహిళలకు ఎంతో ఆధరణ ఉన్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌పురోహిత్ సమాజ్ కార్యదర్శి సరితాదేవి, మనోజ్, రవి, శీలం సరస్వతీ, రోహిత్‌తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



గవర్నర్ నరసింహన్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



ముఖ్యమంత్రి రోశయ్యకు రాఖీ కడుతున్న విద్యార్థిని



టీడీపీ అధినేత చంద్రబాబుకు రాఖీ కడుతున్న కార్యకర్త



మంత్రి దానం నాగేందర్‌కు రాఖీ కడుతున్న మేయర్

## విదేశీ ఘుమఘుమలు





మేజర్‌న్యూస్, హైదరాబాద్ : ప్రపంచంలోని వివిధ ప్రాంతాల వంటకాలను నగరవాసులకు పరిచయం చేస్తున్నాయి నగరంలో కొనసాగుతున్న ఫుడ్ ఫెస్టివల్స్. స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లలో జరుగుతున్న ఈ ఆహారోత్సవాలలో ఘుమఘుమలాడే వివిధ దేశాల వంటకాలు నగరవాసులకు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా వివిధ దేశాల వంటకాలను పరిచయం చేస్తున్న తాజ్ బంజారా స్టార్ హోటల్‌లో కొత్తగా 'డిమ్ సుమ్' ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతోంది. దక్షిణ చైనాలో ప్రసిద్ధిగాంచిన డిమ్ సుమ్ వంటకాలను నగరవాసులకు ఇక్కడ వేడి,వేడిగా సర్వ్‌చేస్తున్నారు. ఈ ఆహారోత్సవంలో భాగంగా చికెన్,మటన్, సీఫుడ్, వెజిటేబుల్స్‌తో తయారైన రుచికరమైన వంటకాలను ఇక్కడ అందిస్తున్నారు. ప్రధానంగా స్నాక్స్‌గా తయారయ్యే డిమ్ సుమ్ వంటకాలు హాంకాంగ్‌లో ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ఈ రుచికరమైన వంటకాలను ఎగ్జిక్యూటివ్ చెఫ్ రాజీవ్ జన్వేజా తన బృందంతో కలిసి ప్రత్యేకంగా తయారుచేసి వడ్డిస్తున్నారు. వీటిలో కాంటోనీస్ సియు మాయ్, బావ్ట్ గార్లిక్ డిమ్ సుమ్, టొఫు, షిటేక్ మషురూమ్ డిమ్ సుమ్, లోటస్ స్టెమ్, స్ప్రింగ్ ఆనియన్ డిమ్ సుమ్ వంటకాలు భోజనప్రియులను చవులూరిస్తున్నాయి. స్చెవాన్ ప్రాన్ డిమ్ సుమ్, సీ ఫుడ్ ఫైవ్ స్పైస్ డిమ్ సుమ్, సెసెమ్ ఫ్లేవర్ మరెల్ ఫిష్ డిమ్ సుమ్, వాటర్ చెస్ట్‌నట్, క్రాబ్ డిమ్‌సుమ్ వంటి వంటకాలు ఇక్కడ అందర్నీ సంతృప్తిపరుస్తున్నాయి. ఈ ఫుడ్ ఫెస్టివల్ ఈనెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని ఎగ్జిక్యూటివ్ చెఫ్ రాజీవ్ జన్వేజా తెలిపారు.





## సమాజంకోసం ప్రసార మాధ్యమాలు
## కృషి చేయాలి : మంత్రి గీతారెడ్డి

మేజర్‌న్యూస్, సిటీబ్యూరో – సమాజం కోసం ప్రసార మాధ్యమాలు కృషి చేయాలని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి పిలుపునిచ్చారు. పోటీతత్వం పెరిగిపోవడంతో ఛానెల్స్ టిఆర్‌పి రేట్ల కోసం సంచలనాలకు ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఒక ప్రైవేట్ టీవి న్యూస్ ఛానల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన ఛానల్ ప్రజల గొంతుకను వినిపించేదిగా, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేదిగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మన గొప్ప వారసత్వాన్ని, చరిత్రను నేటి తరానికి తెలపాలన్నారు. తమ ప్రభుత్వం మీడియాతో సత్సంబంధాలు కలిగిన ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి కేంద్ర సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ, మాజి రాష్ట్ర మంత్రులు శనిగరపు సంతోష్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, బిజెపి నాయకులు సీనియర్ నాయకులు బద్దం బాల్‌రెడ్డి, నిజమాబాద్ పార్లమెంటు సభ్యులు మధుయాష్కిగౌడ్, లోక్‌సత్తా నాయకులు వర్మ తదితరులు పాల్గొన్నారు.




## అలరించిన సంస్కృత కవి సమ్మేళనం



సత్కారాలు అందుకున్న సంస్కృత కవులతో అతిథులు

శ్రీత్యాగరాయగానసభ(మేజర్‌న్యూస్) ఆంధ్రప్రదేశ్ సంస్కృత ఆధ్యాపక సంఘం, శ్రీ రాజశ్యామల సంస్కృతాంధ్ర కళాపీఠం, గానసభలు సంయుక్తంగా మంగళవారం కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించిన సంస్కృత కవి సమ్మేళనం పండితుల మన్ననలందుకుంది. దేశ భాషలకు మూలమైన దేవభాష సంస్కృతమని, వేధాలు, శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు, కావ్యాలు ఈభాషలోనే రచింపబడ్డాయని అతిథులు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి విచ్చేయగా కళా వెంకటదీక్షితులు, ఎన్.సి.టి. ఆచార్య, డా॥ ఎ. ప్రభావతి దేవి, సాధన నరసింహాచార్య, డా॥ కె.వి. శర్మ, భట్టనాథస్వామిలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనంలో పాల్గొన్న శివలూరి విశ్వనాథ శర్మ, డా॥ ఎం.వి.ఆర్. శర్మ, డా॥ జి.ఎం. రామశర్మ, డా॥ ఎస్.బి. శ్రీధర్, జొన్నవిత్తుల యజ్ఞ నారాయణశాస్త్రి, వేంకటయ్య, సాయిప్రసాద్, నరసింహాచార్యులు, వి.ఎ. కుమారస్వామిలను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యనలో ప్రతిభలు కనపరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

## ఆధ్యాత్మిక రాగాలు పరిమళించిన వేళ



శ్రీత్యాగరాయగానసభ(మేజర్‌న్యూస్) భక్తిగీతమాల కార్యక్రమాల నిర్వాహణలో జాలీఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు రమేష్ పంథా ఒక కొత్తఒరవడిలో సాగుతుందని, సాంస్కృతి, సాంప్రదాయాలను పల్లవింపజేసే ఆత్మసంతృప్తిని కలిగించే, శ్రవణరమ్యమైన భక్తి గీతాలు వినిపించడంలో ఆయనకు ఆయనే సాటి అని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాఖీపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని జాలీఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీత్యాగరాయగానసభలో నిర్వహించిన భక్తిగీతమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ నవవిధ భక్తిలలో శ్రవణం, కీర్తనం కూడా ఉన్నాయని ఈనాటి భక్తి సంగీతం శ్రవణ కీర్తనాలను ఆవిష్కరింపజేసిందని పేర్కొన్నారు. అధ్యక్షోపన్యాసంలో విష్ణుశ్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ సి.హెచ్ హనుమంతురావు మాట్లాడుతూ సంస్థ నిర్వాహకుడు రమేష్ నిత్యసాయి ఆరాధకుడని ఆయన భక్తి పారవశ్యంతో ఈ భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తాడని, ఆయనకు సాయిభక్త రమేష్ అనే బిరుదుతో ఘనంగా సత్కరిస్తామని పేర్కొన్నారు. గాయనీమణులు నిత్య సంతోషిణి, లావణ్యలత వారి శిశ్య బృందం పద్మసుందరి, మాధవి, వనిత, విజయ, జ్యోతిలు పాడిన భక్తి గీతాలు కనీవినీ ఎరుగని రీతిలో ఆహుతులను అలరించాయి. ఒక లాలన, ఒక లాలిత్యం, భావ గానామృతం పల్లవించి ప్రతీ హృదయం పులకించి ఆనంద తాండవ నృత్య హేల సభారంజకమై నిలిచింది. వేధికపై ఆలయ శోభలు పరిమళించే ఆలయ శిఖరం కనువింపు చేయగా ఆధ్యాత్మిక మాధుర్యంలో ఆహుతులు ఆనందలోకాలలో తేలియాడారు. సత్యం శివం సుందరం, ఎంతెంత దయనీది ఓ సాయి, కురై యింద్రుం ఇల్లె, యేహి మురారె, జగ్‌మే సుందర్‌హై దో నామ్ వంటి గీతాలను ఆలపించిన గాయక బృందాన్ని అతిథులు సంస్థ పక్షాన సత్కరించి అభినందించారు.

## మరియమ్మ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు

గచ్చిబౌలి, మేజర్‌న్యూస్ : గిరిజన సాంప్రదాయబద్ధంగా మరియమ్మ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను మంగళవారం గోపన్‌పల్లి తాండాలో ఘనంగా నిర్వహించారు. మరియమ్మ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గిరిజన మహిళలు సాంప్రదాయ నృత్యాలను చేస్తూ ఉత్సాహంగా గడిపారు. గిరిజనుల ఆరాధ్య గురువు మరియమ్మ సేవాలాల్ మహారాజ్ ప్రధాన శిష్యుడు రామారావ్ మహారాజ్ పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా ప్రతీ గిరిజన తాండాల్లో ఈ ఉత్సవాలను శ్రావణమాస పౌర్ణమిరోజున నిర్వహించడం అనవాయితీగా వస్తుందని, గోపన్‌పల్లి తాండ గిరిజన నాయకుడు రాజునాయక్ తెలిపారు. గత మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మరియమ్మ సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో ప్రతీ ఏటా ఉత్సవాలను నిర్వహించడం పరిపాటిగా వస్తుందన్నారు. ప్రతీ గిరిజనుడు మద్యపానాలకు దూరంగా వుంటూ, వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు కష్టపడతారని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో చత్రనాయక్, గణేశ్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.